


**మంథా భానుమతి**

# రామ రామా!

"రామా..రామా!" కొన్ని వేల గొంతుకలు నలుదిశలా మారుమోగుతుంటే ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు హనుమంతుడు. ఎప్పుడో ద్వాపరయుగంలో తమ్ముడు భీముడుకి బుద్ధిచెప్పడానికి కిందికెళ్ళాడంతే. ఆ తర్వాత హిమాలయాల్లో ఒక మంచి గుహ చూసుకుని రామనామస్మరణ చేసుకుంటుంటే కాలగమనమే తెలియలేదు.

అయినా..ఇన్ని వేల సంవత్సరాల నించీ జనం తలుచుకున్నా, పాటలు పాడుకున్నా, పద్యాలు రాసుకున్నా రామనామం ఆంజనేయుడికి ఆహ్లాదం కలిగించిందే కానీ ఆందోళన కలిగించలేదు. తన గుహలోనే కూర్చుని సూక్ష్మశరీరంతో తన భక్తులకీ రామభక్తులకీ ఊరట, అవసరం అయితే ధైర్యం కలిగిస్తున్నాడు. ఈసారిమాత్రం..ఎందుకో.. ఈ 'రామా' అన్న పిలుపులో ఆక్రోశం వినిపిస్తోంది.

ఒకసారి తన దివ్యదృష్టితో పరికించాడు. ఏమీ అర్థం అవలేదు. తమ కష్టాలు, బాధలు తీర్చమని అడగడానికి పిలిచినట్లు లేదు. అలా అయితే స్వామి అవసరం లేదు, తన 'వాలం' చాలు.

'సరే ఆయన్నే అడుగుదాం' అనుకుని, లేచి గంగ ఒడ్డుకి వెళ్ళాడు. గర్భగుడి తలుపుతీసినట్లుగా, సునాయాసంగా తన వక్షస్థలం మధ్యకి రెండు చేతుల్తో విడదీసి, గంగలోకి చూశాడు. స్వామి ప్రతిబింబం కనిపించింది.

అంతే! వచ్చిన పని మరచిపోయి రెండు చేతుల్తో రామ భజన చెయ్యసాగాడు.

"హనుమా!" రాముడి ప్రతిబింబం నిజ రూపం దాల్చింది. "ఏదో అడగాలని పిలిచినట్లున్నావు?"

"స్వామీ! ఆ శబ్దాలు వినిపించట్లేదా? నిన్ను పిలిచే వాణ్ణికాదు. ఆ రామశబ్దంలోని భావం నాకు తెలిస్తే, అందులో ఆవేదన లేదు, ఆర్తి లేదు. ఆనందం లేదు. నువ్వు ఊరుకుంటే ఎలా స్వామీ?"

"అది జపం కాదు స్మరణా కాదు. అసలు రాముడెవరు? ఆధారాలేవి? ఏదో కావ్యంలో నాయకుడైన చరిత్ర అనుకుంటే మానవమాత్రుడైన రాముడు దేవుడేమిటీ? సముద్రంలో వంతెనలాగ ఉన్న ఆ రాళ్ళు రవాణాకి అంతరాయం కలిగిస్తున్నాయి. 'తీసేద్దాం' అని కొందరూ 'హత్తెరీ. మా దేవుణ్ణి అంత మాటంటారా..సేతుని ముట్టుకుంటే అక్కడ సముద్రం అంతా రక్తమయమైపోతుంది జాగ్రత్త!' అని కొందరూ అరచుకునే అరుపులు అవి. అందుకే నీకవి వింతగా తోచాయి"

కాళ్ళకింద భూకంపం వచ్చినట్లు అంతెత్తు ఎగిరాడు. వంతెన కట్టకముందు సముద్రం ఈ గట్టు నుంచి ఆగట్టుకి దూకిన అతిబలుడు.

"ఆధారమా స్వామీ! వాల్మీకి స్పష్టంగా సేతు బంధనం గురించి వర్ణించాడు కదా! దానికి ఎంత మంది పనిచేశారో లెక్కలవీ చెప్పాడు కదా? ఇంకా ఏం కావాలీ?"

రాముడు తన మామూలు చిరునవ్వు విసిరాడు.

"అది, నువ్వు, నేనూ తీర్చలేని సమస్య..'సేతు' గురించి"

"సీతమ్మని తీసుకుని రావడానికి వేసిన సేతు గురించా? ఇన్ని సముద్ర సంక్షోభాలని తట్టుకుని ఇంకా ఉందా అది?" వాయుసుతునికి అంతా అయోమయంగా వుంది.

"అదే ఇప్పుడు అందరికీ వచ్చిన అనుమానం. అయినా హనుమా! అన్నేసి టన్నుల ఇనుముతో, సిమెంటుతో కట్టిన వంతెనలు భూమ్మీద నెలల్లోనే కూలిపోతుంటే..సముద్రంలో నీలుడూ, నువ్వూ ఇంకా మన వానరులందరూ పేర్చిన రాతివారధి ఇంకా ఏ విధంగా నిలిచి ఉంది?" స్వామి ప్రశ్నకి అంజనీపుత్రుడు పకపకా నవ్వాడు.

"సర్వాంతర్యామివి నీకు తెలియదా! ఎలా కట్టామో మాకేం తెలుసు? రామనామం రాసి రాతిని విసిరామంతే. ఒక్కో రాయీ అతుక్కుని రహదారైపోయింది. ఇప్పుడు ఆ వంతెన ఇంత గందరగోళం సృష్టిస్తోందా? దానికి కులమతాల్లేకుండా అందరూ రామనామం జపిస్తున్నారా?"

"ఇంత అమాయకుడవేమిటయ్యా?" దాశరథి దయతో చూశాడు తన బంటుని.

"అబ్బే! అలా రాతల్లో ఉంటే సరిపోదటయ్యా..ప్రత్యక్ష ఆధారాలుంటేనే నమ్ముతారట. అవి ఇప్పుడెక్కడ దొరుకుతాయి?" కోసలేంద్రుడు కినుకగా అన్నాడు.

మోకాళ్ళ మీద కూర్చుని ఒక్కక్షణం ఆలోచించాడు హనుమ.

"గోపన్నని రక్షించడానికీ, త్యాగయ్యని దొంగల బారినుంచి కాపాడ్డానికి వెళ్ళావుకదా స్వామీ..ఇప్పుడు మన ఉనికిని నిలబెట్టుకోవడానికి ఓసారి మానవులకి కనిపించి వద్దామా?" సాలోచనగా అన్నాడు సుందరకాండ నాయకుడు.

"అబ్బే! అదేం లాభం లేదయ్యా" పెదవి విరిచాడు జానకీవిభుడు.

"మనం కనిపిస్తే సినిమాల్లోనో, నాటకాల్లోనో వేషాలు వేసే వాళ్ళమనుకుంటారు. వారికి, వాహనాలు నడపడానికిచ్చే అనుమతి పత్రం, గృహ నిర్ధారణ పత్రం, సుంకం చెల్లించిన కాగితాలు..లేదా ఆహారపదార్థాలు కొనుక్కోడానికిచ్చే పత్రం వంటివి కావాలి. అవి మన దగ్గరెక్కడుంటాయి? మన కాలంలో రథం మీదో, గుర్రం మీదో, కాలినడకనో వెళ్ళేవాళ్ళం కదా! అప్పుడు నేను నివశించిన ఇళ్ళేవీ లేవు. సుంకం అంటావా? అందరూ నాకు చెల్లించే వాళ్ళే కానీ, నేనెవరికీ కట్టలేదు. ఇంక ఆహారపదా

ర్థాలూ.."

"రామరాజ్యంలో వాటికి కొదవేముంది స్వామీ" భక్తి పారవశ్యంతో అన్నాడు రామబంటు.

"ఇవేవీ లేకపోతే జన్యు పరీక్ష బ్రహ్మాస్త్రం లాంటిది. అది నిర్ధారణ అయితే ఎదురు లేదు"

ఇంకేం..వాయు నందనుడి మొహం వికసించింది. "వెంటనే వైకుంఠంలో ఉన్న దశరథ మహారాజునీ, జనక మహారాజునీ పిలుచుకొద్దాం" అని లేచాడు.

"నీకంతా తొందరే హనుమా! కాస్త ఆగి ఆలోచించు. అదెలా సాధ్యం? నేను అగ్నిదేముడిచ్చిన పాయసం వల్ల జన్మించాను. సీతేమో భూమిలో నాగలికి తగిలింది. ఇంక జన్యు పరీక్ష ఏం ఫలితం ఇస్తుంది?"

"నిజమే స్వామీ..పోనీ మళ్ళీ రామాయణం జరిపిస్తే..ఆధునిక మానవుల్లాగే ఆహార్యంతో.." ఇంకా హనుమంతుడి మాట పూర్తికాలేదు నిదానానికి మారుపేరైన శ్రీరాముడు నిట్టూర్చాడు.

"అది అసలు కుదరదయ్యా! ఇప్పుడు సీత అడవిలో ఒంటరిగా ఉంటే చాలామంది రావణులు ఎత్తుకుపోవడానికి వస్తారు. వెతకడానికి నీకు సాధ్యమేనా? అదీకాక మారీచుడు మొరాయిస్తాడు, మళ్ళీ భూమ్మీదికి రావడానికి. సీతకి కనిపించి, తను నన్నడిగి, నేను అతన్ని వెతకడానికి వెళ్ళేలోపుగా, సినీతారలు, రాజకీయ నాయకులు నంజుకు తింటారేమోనని..."

పాపం హనుమ హతాశుడైపోయాడు. ○

(ఇంటర్‌నెట్‌లో చూసిన ఒక సెటైరికల్ సమాచారం ఆధారంగా
-రచయిత్రి)


